సాక్షి పెద్దపల్లి

గురువారం । 7 । సెప్టెంబర్ । 2023

అంగరంగ వైభవంగా
శ్రీకృష్ణుడి శోభాయాత్ర



పాలకుర్తి: మండలంలోని కన్నాల పంచాయతీ పరిధి బోడగుట్టపల్లిలో కృష్ణాష్టమి సందర్భంగా శ్రీకృష్ణుడి శోభాయాత్ర నిర్వహించారు. త్రైతసిద్ధాంత ప్రభోద సేవాసమితి అధ్యక్షుడు నాగిరెడ్డి ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను పల్లకిలో ప్రధాన వీధుల మీదుగా ఊరేగించారు. సర్పంచ్ మల్క చంద్రకళ, సేవాసమితి సభ్యులు రాజు, దీక్షిత్, సునీత, మహేశ్, బాలరాజు, లావణ్య, మధు, రాజురవి పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

దివ్యాంగ చిన్నారులపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న అడిషనల్‌కలెక్టర్ అరుణశ్రీ

పెద్దపల్లిరూరల్: దివ్యాంగ చిన్నారులకు అవసరమైన ఉపకరణాలను అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ అన్నారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రం ఆవరణలో బుధవారం పరికరాల పంపిణీలో డీఈఓ మాధవితో కలిసి మాట్లాడారు. 137 మంది దివ్యాంగులకు 216 ఉపకరణాలు పంపిణీ చేశారు. వీల్‌చైర్స్, వినికిడి యంత్రాలు, రోలేటర్స్, చంకకర్రలు, కాలిపర్స్ తదితర పరికరాలు ఉన్నాయి. ముందుగా దివ్యాంగ విద్యార్థుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. జిల్లా కో–ఆర్డినేటర్ విజయ్‌కుమార్, వెల్ఫేర్ ఆఫీసర్ రవుఫ్‌ఖాన్, ఎంపీడీఓ రాజు, పెద్దపల్లి, కమాన్‌పూర్ ఎంఈవోలు సంపత్‌రావు, సురేందర్ పాల్గొన్నారు.

ఆదివరాహస్వామి హుండీ ఆదాయం రూ.5.23లక్షలు



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

కమాన్‌పూర్: మండలకేంద్రంలోని ఆదివరాహస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని స్వామివారి కల్యాణమండపంలో బుధవారం లెక్కించారు. భక్తుల ద్వారా రూ.5,23,946 వచ్చినట్లు ఆలయ చైర్‌పర్సన్ ఇనగంటి ప్రేమలత, ఈవో కాంతరెడ్డి తెలిపారు. ఐదు నెలల నుంచి స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులు కానుకల రూపంలో హుండీలో వేసిన ఆదాయాన్ని లెక్కించినట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సుజాత, డైరెక్టర్లు దండె కనుకరత్నం, పిడుగు ఆంజనేయులు, భూపెల్లి జ్యోతి, కొలిపాక లక్ష్మి, నాయకులు ఇనగంటి రామారావు పాల్గొన్నారు.

విద్యాప్రమాణాల పెంపునకే 'ఉన్నతి'



మాట్లాడుతున్న డీఈవో మాధవి

జ్యోతినగర్: ఉన్నత పాఠశాల విద్యార్థుల్లో అభ్యసన ఫలితాలు పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ విద్యాసంవత్సరం నుంచి ఉన్నతి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని డీఈవో డి.మాధవి అన్నారు. ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని జెడ్పీ హైస్కూల్‌లో భౌతికశాస్త్ర ఉపాధ్యాయులకు మూడు రోజులుగా ఇస్తున్న శిక్షణ బుధవారంతో ముగిసింది. 6 నుంచి 9వ తరగతుల విద్యార్థుల కోసం దీనిని రూపొందించారని, కార్యక్రమ ఆవశ్యకత, లక్ష్యాలు, విధివిధానాలు, వాచకాలు, బోధన ప్రణాళిక వంటి అంశాలపై శిక్షణ అందిస్తున్నామని స్పష్టం చేశారు. పిల్లల స్థాయికి అనుగుణంగా బోధన ఎలా చేయాలో ఈ కార్యక్రమం తోడ్పడుతుందని అన్నారు. అకాడమిక్ మానిటరింగ్ అధికారి షేక్, సెంటర్ ఇన్‌చార్జి ఇరుగురాల ఓదెలు, విమల, రవినందర్‌రావు, జక్కం శ్రీనివాస్, జగదీశ్వర్, రాజేశ్వరావు పాల్గొన్నారు.

11న కార్మికసంఘాలతో డిప్యూటీ సీఎల్‌సీ సమావేశం

గోదావరిఖని: సింగరేణి కార్మికసంఘాలతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ డి.శ్రీనివాసులు ఈనెల 11న హైదరాబాద్‌లోని కార్యాలయంలో సమావేశం కానున్నారు. ఉదయం 11గంటలకు హాజరు కావాలని సింగరేణి యాజమాన్యంతోపాటు 14కార్మిక సంఘాలకు లేఖలు పంపించారు. సింగరేణిలో గుర్తింపు ఎన్నికలపై కార్మిక సంఘాలు కోర్టుకు వెళ్లిన నేపథ్యంలో డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ ఈ లేఖలు జారీ చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

అర్హులకు రేషన్‌కార్డులు ఇవ్వాలి

సుల్తానాబాద్: అర్హులైన వారందరికీ కొత్త రేషన్ కార్డులతో పాటు పాత రేషన్ కార్డులో కుటుంబ సభ్యుల పేర్లు చేర్చాలని రాష్ట్ర మున్నూరు కాపు యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ ఆకుల స్వామి వివేక్ పటేల్ బుధవారం మంత్రి గంగుల కమలాకర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. కరీంనగర్‌లోని మంత్రి నివాసంలో కలిసి విన్నవించినట్లు ఆయన తెలిపారు.

దోమలు ముసురుతున్నాయ్




- ఈ చిత్రంలో మూలకుపడేసి కనిపిస్తున్న ధర్మాఫాగర్స్ ఫాగింగ్ మిషన్లు రామగుండం కార్పొరేషన్ పరిధిలోనివి. బల్దియా రూ.4.90 లక్షల వ్యయంతో ఏడు ఫాగింగ్ యంత్రాలు కొనుగోలు చేసింది. నగరవాసులు దోమలతో ఇబ్బంది పడుతుంటే వాటిని అధికారులు మరమ్మతుల సాకుతో మూలకుపడేశారు. వాహనాల్లో రెండు ఫాగింగ్‌యంత్రాలను పెట్టుకుని నగరంలో ఫాగింగ్ చేస్తుండడంపై విమర్శలు వస్తున్నా పాలకవర్గం పట్టించుకోవడం లేదు. గతేడాది రూ.20లక్షలు వెచ్చించిన, అధికారుల మొక్కుబడి చర్యలతో దోమల బెడద మాత్రం తగ్గలేదు.





- బల్దియాల్లో మూలకుచేరిన ఫాగింగ్ యంత్రాలు
- విజృంభిస్తున్న దోమలు.. జ్వరాల బారిన ప్రజలు
- మొక్కుబడిగా పారిశుధ్య పనుల నిర్వహణ



ఈ చిత్రంలో కనిపిస్తున్నది జిల్లాకేంద్రంలోని చికురాయి చౌరస్తాలోనిది. వర్షాలతో వచ్చిన నీరు ఇళ్ల మధ్య నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. దోమల బారిన పడి కాలనీవాసులు జ్వరాలతో ఇబ్బంది దుతున్నారు. పెద్దపల్లి మున్సిపాలిటీల్లో 4 ఫాగింగ్ యంత్రాలు ఉండగా.. మూడు పనిచేస్తున్నాయని, ఒకటి మరమ్మతుకు ఇచ్చామని అధికారులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం ఎటువంటి చర్యలూ చేపట్టడంలేదని పట్టణవాసులు వాపోతున్నారు.

సాక్షి, పెద్దపల్లి: మలేరియా, డెంగీ, చికున్‌గున్యా దోమలతో వ్యాపించే ప్రాణాంతకమైన జ్వరాలు. ఒక చిన్న దోమ ఎంత పెద్ద ప్రమాదాన్ని తీసుకొస్తుందో చెప్పడానికి ఈ జ్వరాలే ఉదాహరణ. వాతావరణంలో మార్పులకు తోడు మున్సిపాలిటీల్లో పారిశుధ్య నిర్వహణ లోపంతో దోమలు విజృంభిస్తున్నాయి. దోమల నివారణకు మున్సిపాలిటీ ఖర్చు చేస్తున్న నిధులు మస్కిటోకాయిల్‌గా కరిగిపోతున్నాయిగానీ దోమల మోత మాత్రం తగ్గటం లేదు. జూలైలో భారీ వర్షాల కారణంగా.. తాజాగా కురుస్తున్న వర్షాలతో కాలువల్లోని మురుగు నీరు, ఇళ్ల మధ్య ఉన్న ఓపెన్ ప్లాట్స్ మధ్య ఉన్న నీటిలో దోమలు విజృంభించి జ్వరాల బారిన పడుతున్నారు. పందుల స్వైరవిహారం చేస్తుండటంతో వ్యాధుల బారినపడుతున్నారు.

జాడలేని ఫాగింగ్

దోమల నివారణలో ఫాగింగ్ ప్రధానం. మున్సిపాలిటీల పరిధిలో ఫాగింగ్ యంత్రాలు అందుబాటులో ఉన్నప్పటికీ వాటి సేవలు వినియోగించడంలేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రికార్డుల్లో మాత్రం ఎప్పటికప్పుడు దోమల నివారణ చర్యలు చేపడుతున్నట్లు నమోదు చేయడం, నిధులు ఖర్చు చేస్తున్నట్లు రికార్డులు సృష్టిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దోమల నివారణకు బల్దియాల్లో ఏటా రూ.2లక్షల నుంచి రూ.6లక్షల వరకు ఖర్చు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. పాలకవర్గాలతోపాటు దోమల దాడిని తట్టుకునేందుకు ప్రతినెలా నిత్యావసర సామగ్రి మాదిరిగానే లిక్విడ్స్, మస్కిటో రీఫిల్స్, కాయిల్స్ వంటి వాటికి నెలకు రూ.100 నుంచి రూ.500 వరకు ఒక్కో కుటుంబం ఖర్చు చేస్తోంది. ఇవి కాకుండా దోమల బ్యాట్స్, దోమతెరలు వంటి వాటికోసం ప్రజలు అదనంగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

దోమ	వ్యాధులు
అనాఫిలిస్	మలేరియా
క్యూలెక్స్	బోదకాలు, మెదడువాపు
ఏడీస్	డెంగీ, చికెన్‌గున్యా
మాన్సోనియా	బోదకాలు

క్లోరినేషన్ ఏదీ..?

మంచినీటి ట్యాంకుల్లోనూ క్లోరినేషన్ చేసిన దాఖలాలు కానరావడం లేదు. నిలువ నీరు ఉన్న చోట లార్వా వృద్ధి చెందే అవకాశాలు ఉంటాయి. క్లోరినేషన్ చేయడం ద్వారా దోమలు వృద్ధి చెందే అవకాశాలు తక్కువగా ఉంటాయి. నాలాల్లో సైతం బ్లీచింగ్ చేయడం లేదు. దీంతో సాయంత్రం వేళ నాలాల్లో ఉన్న దోమలన్నీ ఇళ్లలోకి చేరుతున్నాయి.



జిల్లాకేంద్రంలోని క్రిస్టియన్ కాలనీలో ఇళ్ల మధ్య నిలిచిన మురుగునీరు



సుల్తానాబాద్‌లోని శాస్త్రీరోడ్‌లో ఓపెన్‌ప్లాట్లలో నిలిచిన వరదనీరు

బల్దియా ఏం చేయాలి

- ఖాళీ స్థలాలు అపరిశుభ్రంగా ఉంటే యజమానులకు నోటీసులు జారీ చేయాలి. స్పందించకపోతే జరిమానా విధించాలి
- జరిమానా చెల్లించకపోతే పారిశుధ్య కార్మికులతో శుభ్రం చేయించి ఆ ఖర్చును వసూలు చేయాలి.
- మురుగునీటిలో ఎంఎల్వో ఆయిల్ బాల్స్ విసరాలి. కిరోసిన్, ఇతర రసాయనాలు చల్లాలి. ఫాగింగ్ చేపట్టాలి.

ఉద్యోగాల పేరిట తీసుకున్న డబ్బులు తిరిగివ్వాలి

- మావోయిస్టు జేఎండబ్ల్యూపీ డివిజన్ కమిటీ కార్యదర్శి వెంకటేశ్

సాక్షి, పెద్దపల్లి: ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో ఉద్యోగాలు పెట్టిస్తామని తీసుకున్న డబ్బులను బాధితులకు వెంటనే ఇవ్వాలని భారత కమ్యూనిటీ పార్టీ (మావోయిస్టు) జయశంకర్, మహబూబాబాద్, వరంగల్–2, పెద్దపల్లి (జెఎండబ్ల్యూపీ) డివిజన్ కమిటీ కార్యదర్శి వెంకటేశ్ పేర్కొన్నారు. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పెద్దపల్లి మండలం గౌరెడ్డిపేటకు చెందిన బీఆర్ఎస్ నాయకులు బండారి శ్రీనివాస్‌గౌడ్, భూషణవేణి శ్రీనివాస్, శ్రీరాములు, గోపాల్ కలిసి ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని 30 మంది వద్ద ఒక్కొక్కరి నుంచి రూ.4 నుంచి రూ.6లక్షలు తీసుకున్నారని, బాధితులకు డబ్బులు తిరిగి ఇవ్వకపోగా.. బెదిరింపులకు దిగుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ యంత్రాంగం అండతో గ్రామాల్లో భూకబ్జాలు, సెంటిల్‌మెంట్స్, పంచాయితీలు చేస్తూ దళితులపై కేసులు నమోదు చేయించారని, పంచాయితీలు బంద్ చేసి దళితులకు క్షమాపణలు చెప్పాలని, ఆర్‌ఎఫ్‌సీఎల్ బాధితులకు డబ్బులు తిరిగి ఇవ్వాలని, లేకుంటే ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

పెద్దపల్లిలో కాంగ్రెస్‌దే గెలుపు

- మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు



పార్టీలో చేరిన వారితో విజయరమణారావు

ఓదెల: వచ్చే ఎన్నికల్లో పెద్దపల్లిలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని టీపీసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట విజయరమణారావు అన్నారు. ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బీఆర్ఎస్‌ను ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని వివరించారు. మండలంలోని పిట్టలఎల్లయ్యపల్లెలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివిధ గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరగా.. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ గెలిచాక కష్టపడే కార్యకర్తల రుణం తీర్చుకుంటానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ, రూ.500కే గ్యాస్ సౌకర్యం, ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. బీఆర్ఎస్ హయాంలో ఖనిజసంపద, మానేరు ఇసుక, మట్టి దోపిడీ పెరిగిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు, కాల్వశ్రీరాంపూర్ మాజీ జెడ్పీటీసీ గోపగాని సారయ్యగౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి, సీనియర్ నాయకులు మినుపాల ప్రకాశ్‌రావు, అంతటి అన్నయ్యగౌడ్, బైరి రవిగౌడ్, చీకట్ల మొండయ్య, మాజీ సర్పంచు పుప్పాల శంకర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి సర్పంచ్..

పిట్టలఎల్లయ్యపల్లె సర్పంచు పిట్టల సరిత, ఆమె భర్త, మాజీ వైస్ ఎంపీపీ పిట్టల రవికుమార్, మడక మాజీ ఎంపీటీసీ రాపోలు హన్మంతరావు, ఓదెల మాజీ ఉపసర్పంచు అప్పని కుమారస్వామి, నాయకులు బాపురావు, ఇందుర్తి, బాయమ్మపల్లె, కనగర్తి, ఓదెల గ్రామాల్లో ఆయాపార్టీల నుంచి పెద్దఎత్తున కాంగ్రెస్‌లో చేరారు. వారికి విజయరమణారావు కండువాలు కప్పి ఆహ్వానించారు.

సరిహద్దు ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి

ధర్మారం/సుల్తానాబాద్‌రూరల్/రామగిరి: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో శాంతిభద్రతలకు ఆటంకాలు కలగకుండా ఎన్నికల కమిషన్ నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని పెద్దపల్లి ఏసీపీ ఎడ్ల మహేశ్ సూచించారు. ధర్మారం మండలం నందిమేడారంలోని కాళేశ్వరం ప్రాజెక్టు గెస్ట్‌హౌజ్, సుల్తానాబాద్ మండలంలోని బొంతకుంటపల్లిలోని గెస్ట్‌హౌజ్‌లో రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల ఏసీపీలతోపాటు జగిత్యాల డీఎస్పీ వెంకటస్వామి, సిబ్బందితో సమావేశమయ్యారు. ఎన్నికలకు ముందు, ఎన్నికల సమయంలో జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మావోయిస్టుల కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టాలని పేర్కొన్నారు. మద్యం, నగదు నియంత్రణకు చర్యలపై చర్చించారు. జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి గంజాయి, ఇతర మాదకద్రవ్యాల రవాణా నియంత్రణ, నిందితులపై కఠిన చర్యలు తీసుకునేలా ప్రణాళికలు రూపొందించారు. ధర్మపురి నియోజకవర్గ పోలీస్‌శాఖ ఎన్నికల అధికారిగా రవీందర్‌కుమార్, పెద్దపల్లి నియోజకవర్గ పోలీస్‌శాఖ ఎన్నికల అధికారిగా ఎడ్ల మహేశ్ వ్యవహరించనున్నారు. కరీంనగర్ రూరల్ ఏసీపీ కరుణాకర్‌రావు, కరీంనగర్ టౌన్ ఏసీపీ నరేందర్, పెద్దపల్లి, మల్యాల, లక్సెట్టిపేట సీఐలు, ధర్మారం, బసంత్‌నగర్, చొప్పదండి, బీర్‌పూర్, వెల్గటూర్, పెగడపల్లి, జన్నారం, దండేపల్లి ఎస్సైలు పాల్గొన్నారు.



సుల్తానాబాద్ రూరల్: సూచనలిస్తున్న ఏసీపీ

సెంటినరీకాలనీలో..

సరిహద్దు ప్రాంతంలో అప్రమత్తంగా ఉండాలని గోదావరిఖని ఏసీపీ తుల శ్రీనివాస్‌రావు అన్నారు. సెంటనరీకాలనీలో గోదావరిఖని సబ్ డివిజన్ పరిధి, జయశంకర్ జిల్లా పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి, మంథని, గోదావరిఖని టూటౌన్, మహదేవ్‌పూర్, కాటారం సీఐలు, రామగిరి, మంథని, ముత్తారం, కొయ్యూరు, మహదేవ్‌పూర్, కాళేశ్వరం ఎస్సైలు పాల్గొన్నారు.



వాగు దాటాలంటే తాడు తప్పనిసరి..

కమాన్‌పూర్ మండలం గుండారం–రాజాపూర్ శివారులోని బండల వాగు దాటేందుకు రైతులు, కూలీలు భయపడుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా వాగులో ప్రవాహం పెరుగుతుంది. గుండారం రిజర్వాయర్ మత్తడి కూడా తోడవడంతో బండలవాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. అలాంటి సమయంలో రైతులు పొలాల వద్దకు వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో రైతులు అవతలి వైపు నుంచి ఇవతలి వైపు వరకు తాడు కట్టుకుని దాని సహాయంతో వాగు దాటి పొలం పనులకు వెళ్తున్నారు. వాగుపై బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్తులతోపాటు సర్పంచ్ ఆకుల ఓదెలు కోరారు. – కమాన్‌పూర్

పొంగిపొర్లుతున్న హుస్సేనిమియా వాగు

- ధూళికట్ట వరకే బస్సు

ఎలిగేడు: భారీ వర్షాలకు ఎలిగేడు మండల ధూళికట్ట, జూలపల్లి మండల వడుకాపూర్ గ్రామాల మధ్యనున్న హుస్సేనిమియావాగు లోలెవల్ బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తోంది. దీంతో కరీంనగర్ నుంచి ధూళికట్ట మీదుగా వడుకాపూర్, కాచాపూర్, వెంకట్రావుపల్లికి వెళ్లే ఆర్టీసీ బస్సును కేవలం ధూళికట్ట వరకే నడిపిస్తున్నారు. ధూళికట్ట ఊర చెరువు మత్తడి దూకుతోంది. మండలంలోని అన్ని గ్రామాల్లోని చెరువులు, కుంటలు మత్తడి పడుతున్నాయి.

మ్యుటేషన్ పంచాయితీ!

- 'సిరిసిల్ల మండలంలోని ఓ మారుమూల గ్రామానికి చెందిన శ్రీనివాస్ ఐదేళ్ల క్రితం హైదరాబాద్‌లో స్థిరపడ్డాడు. ఇటీవల ఆయన స్వగ్రామంలోని పాతఇంటిని కొనుగోలుచేశాడు. మ్యుటేషన్ చేయించుకోవాలని యత్నించినా.. సాధ్యం కాలేదు.'

- ఇది పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాలోని పరిస్థితే కాదు.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నెలకొన్న దుస్థితి. ఆస్తులు తమవే అయినా.. పేర్లు మారకపోవడం.. యజమానులు మరణించడం.. వెరసి ఏంచేయాలో తెలియక వారసులు సతమతమవుతున్నారు. మానసిక క్షోభ అనుభవిస్తున్నారు.

- వారసులకు దక్కని పూర్వీకుల ఇళ్లు
- మ్యుటేషన్, ఎడిట్ ఆప్షన్ తీసేసిన ప్రభుత్వం
- ఏప్రిల్ నుంచి వేలాది దరఖాస్తులు పెండింగ్

సాక్షిప్రతినిధి, కరీంనగర్: 'పెద్దపల్లి జిల్లాలోని ఓ కుగ్రామంలో ఉన్న ఇల్లు వారసత్వంగా వచ్చింది. నాలుగు తరాలుగా అదే ఇంట్లో వారసులు కూడా నివసిస్తున్నారు. అయితే ఆ ఇంటిని వారసుల పేరిట మార్చుకోవాలనుకున్నారు. కానీ.. ఇంటి యజమాని మరణించిన కారణంగా విరాసత్ కావడం లేదు.'

అసలేం జరిగింది?

ఒకప్పుడు గ్రామాల్లో ఆస్తుల బదిలీ రెండు రకాలుగా జరిగేది. మొదటిది వారసుల పేరు మీదికి.. రెండోది ఇంటిని కొన్న వారి పేర మ్యుటేట్ అయ్యేవి. ఇందుకు సంబంధించిన 'ఇ–పంచాయత్' వెబ్‌సైట్‌లో మీ సేవా కేంద్రం ద్వారా దరఖాస్తు చేసుకునేవారు. ఇందుకోసం రెండు ఆప్షన్లు అందుబాటులో ఉండేవి. అందులో మొదటిది విరాసత్, రెండోది కోర్టు డిక్రీ. ఇందులో ఇంటి యజమానులు తమ ఆస్తులను విరాసత్ దరఖాస్తు ద్వారా వారసులకు ఇచ్చేవారు. రెండు కొనుగోలు చేసుకున్న వారు కోర్టు డిక్రీ ద్వారా దరఖాస్తు చేసుకునేవారు. ఈ దరఖాస్తులను గ్రామ పంచాయతీ సెక్రటరీ విచారణ జరిపిన తర్వాత ఆస్తి మ్యుటేట్ అయ్యేది. గతంలో ఎడిట్ ఆప్షన్ కూడా ఉండేది. దీంతో ఏమైనా తప్పులు ఉన్నా దాన్ని అక్కడే పరిష్కరించుకునేవారు. ఇది చాలా వేగవంతమైన ప్రక్రియ తక్కువ ఖర్చుతో త్వరగా పూర్తయ్యేది. కానీ.. ప్రభుత్వం ఏప్రిల్ ఒకటి నుంచి టీఎస్, బీపాస్ అమల్లోకి తీసుకువచ్చింది. దీని ప్రకారం.. గ్రాపపంచాయతీ ఆస్తుల రిజిస్ట్రేషన్లు అన్నీ రిజిస్ట్రేషన్ కార్యాలయంలోనే జరుగుతున్నాయి. దీంతో 'ఇ–పంచాయత్' వెబ్‌సైట్లో విరాసత్, కోర్టు డిక్రీ ఆప్షన్లు మాయమయ్యాయి. ఫలితంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేలాది ఇళ్లు బదిలీ కాక అలాగే మిగిలిపోతున్నాయి.



జిల్లా	గ్రామపంచాయతీలు
కరీంనగర్	313
పెద్దపల్లి	267
రాజన్నసిరిసిల్ల	255
జగిత్యాల	380

సమస్య ఏంటి?

నాలుగు జిల్లాల్లోని గ్రామాల్లో వేలాది ఇళ్లకు సరైన ధ్రువపత్రాలు లేవు. దశాబ్దాలుగా వారసత్వంగా ఇళ్లు చేతులు మారుతున్నాయి. ఇంటి నంబర్లు ఉండడంతో ఏటా పన్నులు కడుతారు. కానీ.. ఆ ఇల్లు కొన్నట్లు, కట్టినట్లు ఎలాంటి పత్రాలు లేవు. వాస్తవానికి గ్రామపంచాయతీల ఆవిర్భావానికి ముందు నుంచే ఆ ఇళ్లు మనుగడలో ఉన్నాయి. ఇలాంటి ఇళ్ల పరిస్థితుల్లో ప్రధానమైన చిక్కులు తలెత్తుతున్నాయి.

అడ్డంకులివే..

- ఇంటి యజమానులు లేకుంటే ఆ ఇళ్ల వారసుల పేరిట బదిలీ కావడం లేదు. యజమాని బతికుంటే విరాసత్ సజావుగా సాగుతున్నాయి.
- ఇంటి నెంబరు, ఇంటి పన్నులు కట్టిన కాగితాలు తప్ప ఇంటికి సంబంధించిన ఇతర డాక్యుమెంట్లు ఏవీ లేని ఇళ్ల రిజిస్ట్రేషన్ చేసేందుకు అధికారులు నిరాకరిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు.
- ఉమ్మడి జిల్లాలో నాలుగేళ్ల.. అంతకుముందు సరైన డాక్యుమెంట్లు లేని ఇండ్లను చాలామందే కొనుగోలు చేశారు. వీటిలో చాలామటుకు మ్యుటేషన్ కాలేదు. టీఎస్ బీపాస్‌తో ఆస్తులు మ్యుటేషన్ కాకపోవడంతో ఆఫీసర్లు పక్కన పెడుతున్నారు.
- గతంలో రేకుల ఇల్లు/ పెంకుటిల్లును కూల్చి, గ్రామంలో కొత్తగా జీ+2 నిర్మించుకున్నా సరే ఆన్‌లైన్‌లో ఇంకా పాత రేకుల ఇల్లు/ పెంకుటిల్లుగానే చూపెడుతోంది. 'ఎడిట్' ఆప్షన్ లేకపోవడంతో ఈ సమస్య ఉత్పన్నమవుతోంది. దీంతో అన్ని అనుమతులతో ఇల్లు నిర్మించుకున్న యజమానులు, పన్నులు రాక పంచాయతీ అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

ఇబ్బందులివీ..

- కుటుంబ అవసరాలకు ఇంటిని విక్రయించాలనుకుంటున్న వారికి పేరుమార్పిడి నిబంధన ఇబ్బందికరంగా మారింది.
- పెళ్లిళ్లు, అనారోగ్య కారణాలతో సతమతమవుతున్న వారు మానసిక క్షోభ అనుభవిస్తున్నారు.
- ఆస్తులు అమ్మాలనుకుంటున్న వారు పంచాయతీ సెక్రటరీలు, సర్పంచులు, వార్డు మెంబర్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.
- వృద్ధులు, నిరక్షరాస్యులు ఏంతెలియక సతమతమవుతున్నారు. ఇంకొన్నిచోట్ల ఇదే అదనుగా కొందరు ఇదిచేస్తాం.. అదిచేస్తామంటూ చేతివాటం ప్రదర్శిస్తున్నారు.
- గతంలో ఇంటిని కొన్నాక.. ఇప్పుడు మ్యుటేషన్ కాకపోవడంతో కొనుగోలుదారుడు, విక్రయదారుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. పేరు మారని ఆస్తులు తమకేందుకంటున్నారు.

సమస్య వాస్తవమే..



గ్రామాల్లో మ్యుటేషన్ సమస్య తీవ్రంగా ఉన్న మాట వాస్తవమే. యజమానులు మరణించిన ఆస్తులు పేరు మార్పిడికాక ఇబ్బందులు పడుతున్నారు. వీటిపై పంచాయతీ అధికారులకు ఎలాంటి అధికారాలు లేకపోవడంతో ఏంచేయలేకపోతున్నారు. సమస్య తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది.

– నరసింహ, సర్పంచ్, జూలపల్లి

క్లుప్తంగా

'అభ్యంతరాలుంటే చెప్పండి'

పెద్దపల్లిరూరల్: ఉపాధ్యాయుల పదోన్నతికి సంబంధించిన తాత్కాలిక సీనియారిటీ జాబితాపై అభ్యంతరాలుంటే ఈనెల 7లోగా తమ కార్యాలయంలో సమర్పించాలని డీఈవో మాధవి తెలిపారు. జీహెచ్‌ఎం గ్రేడ్–పదోన్నతి తాత్కాలిక సీనియారిటీ జాబితా డీఈఓ ఆఫీసులో, ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉందన్నారు. అభ్యంతరాలను ప్రధానోపాధ్యాయుల ధృవీకరణతో డీఈవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్‌లో సమర్పించాలని సూచించారు.

తాళం వేసిన క్వార్టర్‌లో చోరీ

యైటింక్లయిన్‌కాలనీ: కాలనీలోని ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేయగా మరో ఇంట్లో దొంగతనానికి యత్నించారు. వివరాల్లోకి వెళ్తే.. టీ1–585 క్వార్టర్‌లో నివాసం ఉంటూ 2 ఇంక్లైన్ మైన్‌లో సింగరేణి బదిలీ వర్కర్‌గా పని చేస్తున్న వెంకటేశ్ మంగళవారం తాళం వేసి, నైట్ డ్యూటీకి వెళ్లాడు. బుధవారం తెల్లవారుజామున దుండగులు తాళం పగులగొట్టి, లోపలికి చొరబడ్డారు. విధులు ముగించుకొని వచ్చిన వెంకటేశ్‌కు క్వార్టర్ తలుపులు పగిలిపోయి కనిపించాయి. లోపలికి వెళ్లగా వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలోని రూ.20 వేలు చోరీకి గురైనట్లు బాధితుడు తెలిపాడు. అలాగే అదే లైన్ చివరి క్వార్టర్‌లో దొంగతనానికి యత్నించగా లోపల ఉన్నవారు అప్రమత్తమయ్యారు. వారిని పట్టుకోవడానికి ప్రయత్నించగా పారిపోయారు. గోదావరిఖని టూటౌన్ పోలీసులు విచారణ జరుపుతున్నట్లు తెలిసింది.

వరి ధాన్యం లారీ పట్టివేత



రామగిరి: మండలంలోని కల్వచర్లలోని ఓ రైస్‌మిల్లుకు చెందిన వరి ధాన్యం లారీని పోలీసులు పెద్దపల్లి శివారులో బుధవారం పట్టుకున్నారు. లారీలో సమారు 200 క్వింటాళ్ల సన్నరకం ధాన్యాన్ని కల్వచర్ల నుంచి ఇతర ప్రాంతాలకు తరలిస్తుండగా.. సమాచారం అందుకున్న పోలీసులు లారీని పట్టుకుని పౌర సరఫరాల అధికారులకు సమాచారం అందించారు. సదరు ధాన్యం ప్రైవేట్ వ్యక్తుల వద్ద కొన్నదా..? సీఎంఆర్‌కు సంబంధించినదా..? అని పౌరసరఫరాల అధికారులు విచారణ జరిపారు. చివరకు బీపీటీ రకం ధాన్యంగా గుర్తించామని సివిల్ సప్లయ్ డీటీ షఫీ అహ్మద్ తెలిపారు. విచారణ జరిపి సీఎంఆర్ ధాన్యం కాదని నిర్ధారించుకుని లారీని వదిలేశారు.

స్విమ్మింగ్ పూల్ కాంట్రాక్టు కార్మికుల నిరసన



రామగిరి: తమను ఆకారణంగా విధుల నుంచి తొలిగించారని ఆర్జీ–3 పరిధి సెంటనరీకాలనీ స్టేడియంలోని స్విమ్మింగ్ పూల్ కాంట్రాక్టు కార్మికులు సాగర్, కొంరయ్య ఆరోపించారు. ఈ మేరకు బుధవారం స్విమ్మింగ్ పూల్ బైఠాయించి, నిరసన తెలిపారు. 8 నెలల క్రితం కారణం చెప్పకుండా తమను తీసివేశారని, జీఎం కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగం లేక కుటుంబ పోషణ భారంగా మారిదని, వెంటనే తమను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. వారిని విధుల్లోకి తీసుకోవాలని ఐఎఫ్‌టీయూ నాయకుడు ఆకుల వెంకన్న డిమాండ్ చేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీతం: 18K. ఫోన్ : 9640468899, 9640258899 [H.189329]

■ కొత్తగా స్థాపించిన మా కంపెనీ నందు పనిచేయుటకు అభ్యర్థులు కావలెను. మీ అర్హతకు తగిన విధంగా Work from Home సౌకర్యం కలదు. P/T: 8000/-,F/T:ఆకర్షణీయమైన జీతం® 8179175150 [G-10]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933
9951602824

పురాతన ఆలయంపై నిర్లక్ష్యమేల?

- ముత్తారం రంగనాయకస్వామి భూములు అన్యాక్రాంతం
- పురావస్తు, దేవాదాయ శాఖల అధికారుల సమన్వయలోపం
- ప్రారంభించిన అభివృద్ధి పనులు అర్ధంతరంగా నిలిపివేత



ముత్తారంలోని రంగనాయకస్వామి ఆలయం

పెద్దపల్లిరూరల్: 100 ఏళ్లకు పైగా చరిత్ర.. 300 పైగా ఎకరాల భూమి కలిగిన శ్రీరంగనాయకస్వామి ఆలయ ఆలనాపాలన చూసేవారు కరువయ్యారు. పురావస్తు, దేవాదాయ శాఖల అధికారుల మధ్య సమన్వయం లేక నిర్లక్ష్యానికి గురవుతోంది. ఆలయాన్ని ఆధునీకరించేందుకు గతంలో నిధులు మంజూరయ్యాయి. కానీ పనులు చేపట్టడంలో సంబంధిత అధికారుల తీరుతో నిధులు వెనక్కి మళ్లాయన్న ఆరోపణలున్నాయి. పెద్దపల్లి మండలంలోని ముత్తారంలో గల అతి పురాతనమైన శ్రీ రంగనాయక స్వామి ఆలయం అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఈ ప్రాంత జమీందారు ఎరబాటి రంగారావు ఆలయాన్ని నిర్మించి, నిర్వహణ కోసం 380 ఎకరాల భూమిని ఆలయ ధర్మకర్తలకు అప్పగించారు. మండలంలోని కాసులపల్లి, బొంపల్లి, కనగర్తి గ్రామాల పరిధిలో విస్తరించిన ఈ ఆలయ భూములు కాలక్రమేణా అన్యాక్రాంతమయ్యాయి. కాగా, పెద్దపల్లికి చెందిన మున్సిపల్ కౌన్సిలర్ బొంకూరి భాగ్యలక్ష్మి రంగులు వేయిస్తామంటూ పురావస్తు అధికారులకు విన్నవించగా.. సంబంధిత అధికారి ఇటీవలే ఆలయాన్ని సందర్శించారు. చారిత్రక ఈ కట్టడానికి మరమ్మతు చేయాల్సి ఉందని, డంగుసున్నంతోనే చేయాల్సి ఉంటుందని పేర్కొన్నట్లు సమాచారం.

రూ.32 లక్షలతో అభివృద్ధికి ప్రణాళికలు

రంగనాయకస్వామి ఆలయాన్ని రూ.32 లక్షలతో ఆధునీకరించేందుకు ప్రతిపాదనలు రూపొందించారు. ఇందులో భూములు దానం చేసిన రంగారావు వారసులు ఇచ్చిన రూ.3.5 లక్షలు, గ్రామస్తుల విరాళాలతో కలిపి మొత్తం రూ.7 లక్షలు సమకూరాయి. మిగతా రూ.25 లక్షలను అప్పటి ఎమ్మెల్యే గీట్ల ముకుంద రెడ్డి ప్రభుత్వం నుంచి మంజూరు చేయించారు. పనులు ప్రారంభించగా డంగు సున్నంతోనే చేపట్టాలని పురావస్తు శాఖ అధికారుల అభ్యంతరం చెప్పడంతో అర్ధంతరంగా నిలిచిపోయాయి. ఆలయం పురావస్తు శాఖ ఆధీనంలో ఉండటం.. అభివృద్ధి పనులను దేవాదాయ శాఖ అధికారులు చేపట్టడం వివాదాస్పదంగా మారింది. కనీసం ఆలయం ఎదుట ధ్వజస్తంభం ఏర్పాటు చేసే పరిస్థితులు లేక శిథిలావస్థకు చేరుతోంది.

పాలకులు చొరవ చూపాలి



మా ఊళ్లో ఉన్న శ్రీరంగనాయక స్వామి ఆలయ అభివృద్ధికి పాలకులు చొరవ చూపాలి. అతి ప్రాచీన ఈ ఆలయాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. నిధులు కేటాయించి, పనులు చేపట్టాలి.

– నల్లగొండ కుమార్, ధర్మబాధ

శ్రీరంగం.. తర్వాత ఇక్కడే



శ్రీరంగనాయకస్వామి ఆలయం శ్రీరంగంలో తర్వాత ముత్తారంలోనే ఉంది. ఇక్కడ ధ్వజస్తంభం ఏర్పాటు చేయాలి. శిథిలావస్థకు చేరుతున్న ఆలయాన్ని ఆధునీకరిస్తే భక్తులకు ఉపయోగకరంగా ఉంటుంది.

– పురుషోత్తమాచార్యులు, ఆలయ అర్చకుడు

కొత్త ఓటరు కార్డు తీసుకోండి

- డిజిటల్ విధానంలో అందుబాటులోకి తెచ్చిన ఎన్నికల సంఘం
- ఫాం–8 నింపి, పొందవచ్చు



సుల్తానాబాద్: ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ కార్డుల వంటివన్నీ సెల్‌ఫోన్‌లోనే డిజిటల్(డిజి) లాకర్ యాప్‌లో పొందుపరచుకునే అవకాశం ఉంది. వీటిని ఎక్కడైనా అధికారికంగా వాడుకోవచ్చు. ప్రస్తుతం మన ఓటరు కార్డు(ఈ–ఎపిక్) సైతం డిజిటల్ విధానంలో పొందే సదుపాయాన్ని ఎన్నికల సంఘం ఇటీవలే అందుబాటులోకి తెచ్చింది. ఇదివరకు 2022 తర్వాత నమోదు చేసుకున్న ఓటర్లకు మాత్రమే ఈ అవకాశం ఉండగా.. ప్రస్తుతం అందరికీ వర్తింపజేశారు. తొలుత డిజిటల్(పీడీఎఫ్) విధానంలో డౌన్‌లోడ్ చేసుకుని.. దాన్ని డిజి లాకర్ యాప్‌లో పొందుపర్చుకోవడం తోపాటు ప్రింట్ తీసుకుని వాడుకునే అవకాశం కల్పించారు.

గతంలో 14.. ఇప్పుడు 10 అంకెలు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఓటరు గుర్తింపు కార్డుపై 14 అంకెల సంఖ్య ఉండేది. ఇప్పటికీ అనేక మంది ఈ పాత కార్డులే వాడుతున్నారు. ప్రత్యేక రాష్ట్రం వచ్చిన తర్వాత రూపొందిన కార్డులన్నీ 10 అంకెలు (తొలి మూడు ఆంగ్ల అక్షరాలు, మిగిలినవి ఏడు అంకెలు) కలిగి ఉన్నాయి. ఒక్కో నియోజకవర్గానికి ప్రత్యేకంగా మూడు ఆంగ్ల అక్షరాల ప్రత్యేక సిరీస్ ఉంటుంది. పాత కార్డులు ఉన్నవారు సైతం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఫాం–8లోని మూడో ఆప్షన్‌ను ఎంపిక చేసుకుని, కొత్త కార్డు పొందవచ్చు. ఎన్నికల సంఘం ఇంటి వద్దకే నూతన ఓటరు కార్డును పోస్టు ద్వారా పంపిస్తుంది.

ఫోన్ నంబర్‌తో లాగిన్ అవ్వాలి

ఎన్నికల సంఘం నూతనంగా ప్రవేశపెట్టిన voters.eci.gov.in వెబ్‌సైట్‌లో గానీ.. ఫోన్‌లో voter helpline యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని గానీ మొబైల్ నంబర్‌తో లాగిన్ అవ్వాలి. అనంతరం వెబ్‌సైట్ తెరపై కనిపించే ఈ–ఎపిక్ కార్డు డౌన్‌లోడ్ అనే ఆప్షన్‌పై క్లిక్ చేసి, వివరాలు నమోదు చేసిన తర్వాత ఫోన్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. అనంతరం ఈ–ఎపిక్ కార్డును పీడీఎఫ్ రూపంలో డౌన్‌లోడ్ చేసుకోచ్చు. దీన్ని మొబైల్‌లోని డిజిటల్ లాకర్‌లో సేవ్ చేసుకోవచ్చు. ప్రింట్ తీసుకోవచ్చు. కార్డు ముందు భాగంలో ప్రత్యేక చిప్‌తోపాటు వెనుక వైపు క్యూ ఆర్ కోడ్ సైతం వస్తోంది. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా ఓటరు పూర్తి వివరాలు ప్రత్యక్షమవుతాయి.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



సతీశ్ (ఫైల్)

జ్యోతినగర్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఎన్టీపీసీ ఎస్సై బి.జీవన్ తెలిపిన వివరాల ప్రకారం.. రామగుండం కార్పొరేషన్ రెండో డివిజన్ న్యూపీకే రామయ్యకాలనీకి చెందిన దాసరి సతీశ్(35) స్క్రాప్ సామగ్రి సేకరించి, విక్రయించగా వచ్చిన డబ్బులతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం అర్ధరాత్రి క్రషర్ నగర్ ప్రాంతంలోని స్క్రాప్ దుకాణానికి నడుచుకుంటూ వెళ్తుండగా గోదావరిఖని వైపు వెళ్లే గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో అతని తలకు తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు మృతదేహాన్ని గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు శ్యాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పది వేల పండ్ల మొక్కల పంపిణీ



మొక్కలు అందిస్తున్న జీఎం సూర్యనారాయణ

గోదావరిఖని: సింగరేణి ప్రభావిత గ్రామాల ప్రజలకు ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ.సూర్యనారాయణ బుధవారం పండ్ల మొక్కలు పంపిణీ చేశారు. జీఎం కార్యాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో పెంచికల్‌పేట్, సింగిరెడ్డిపల్లి, చందనపూర్, న్యూమారేడుపాక, అల్లూరువాసులకు మామిడి, జామ, నేరేడు, కొబ్బరి, ఉసిరి, సపోట, సీతాఫల తదితర 10 వేల మొక్కలను ఉచితంగా అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్, అధికారుల సంఘం అధ్యక్షుడు మధుసూదన్, ఎస్‌వోటూ జీఎం సలీం, కార్పొరేటర్ బాదె అంజలీదేవి తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణకారుల సమస్యలు పరిష్కరించాలి

- డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాగూర్



రాజ్‌ఠాగూర్‌కు వినతిపత్రం ఇస్తున్న స్వర్ణకారులు

గోదావరిఖని: స్వర్ణకారుల సమస్యలు పరిష్కరించాలని డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాగూర్ డిమాండ్ చేశారు. బుధవారం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో స్వర్ణకారులు చేపట్టిన దీక్షకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలోనైనా స్వర్ణకారుల బతుకులు మారాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వచ్చాక వారి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

బీజేపీ నాయకుల మద్దతు

స్వర్ణకారుల దీక్షకు బీజేపీ నాయకులు మద్దతు ప్రకటించారు. పార్టీ జిల్లా అధ్యక్షులు రావుల రాజేందర్ దీక్షా శిబిరానికి చేరుకొని, సంఘీభావం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణకారుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమంలో వారు కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు.

ఆస్పత్రి నుంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యం



రాజు

గోదావరిఖని: గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బయటకు వెళ్లిన ఇస్లావత్ రాజు కనిపించడం లేదని గోదావరిఖని వన్‌టౌన్ ఎస్సై శరణ్య తెలిపారు. ఆమె వివరాల ప్రకారం.. యైటింక్లయిన్‌కాలనీ రాజీవ్‌నగర్ తండాకు చెందిన రాజును కుటుంబసభ్యులు ఈ నెల 4న ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. 5న రాత్రి 7.30 గంటల సమయంలో బయటకు వెళ్లిన అతను తిరిగి రాలేదని కూతురు అనూష బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు అదృశ్యం కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సైపేర్కొన్నారు.

ఒకరి ఆత్మహత్య

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని అరవింద్‌నగర్ ప్రాంతానికి చెందిన ఎనగందుల శ్రీనివాస్(42) మంగళవారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శ్రీనివాస్‌కు 20ఏళ్ల క్రితం శ్రీలతతో వివాహం జరిగింది. వీరికి సంతానం కలుగలేదు. ఇంట్లోనే కిరాణం నిర్వహిస్తూ బతుకుతున్నారు. ఇటీవల నష్టాలు వచ్చి, అప్పులు పెరిగాయి. శ్రీనివాస్ మద్యానికి బానిసయ్యాడు. అప్పులు ఎలా తీర్చేదని మనస్తాపంతో ఉంటున్నాడు. మంగళవారం రాత్రి ఇంట్లోనే ఉరేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

'బలగం' సర్పంచ్‌కు కన్నీటి వీడ్కోలు

- పలువురి సంతాపం
- హాజరైన జెడ్పీ చైర్‌పర్సన్ తదితరులు



నర్సింగం (ఫైల్)



నర్సింగం మృతదేహంపై కండువా కప్పుతున్న చొక్కాల రాము

కోనరావుపేట(వేములవాడ): బలగం సినిమాలో సర్పంచ్‌గా నటించిన కీసరి నర్సింగం అంత్యక్రియలు బుధవారం అభిమానుల కన్నీటి మధ్య పూర్తయ్యాయి. కోనరావుపేట మండలం నాగారం గ్రామానికి చెందిన కీసరి నర్సింగం కొన్నేళ్లుగా నాటక ప్రదర్శనలు చేస్తూ గుర్తింపు పొందారు. ఇటీవల వేణు డైరెక్షన్‌లో వచ్చిన బలగం సినిమాలో సర్పంచ్‌గా నటించి అందరి ప్రశంసలు పొందారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కళాకారుల సంఘం ప్రధానకార్యదర్శిగా పనిచేస్తున్న నర్సింగం కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం సాయంత్రం మృతిచెందారు. నర్సింగంకు భార్య భూమవ్వ, కుమారుడు శ్రీనివాస్, కూతురు అంజలి ఉన్నారు. అంత్యక్రియల్లో జెడ్పీచైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము, డీపీఆర్వో మామిండ్ల దశరథం, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు, సర్పంచ్ లావణ్య–శ్రీనివాస్, బీజేపీ జిల్లా కార్యదర్శి గోపాడి సురేందర్‌రావు, మాజీ జెడ్పీటీసీ శ్రీకుమార్, నాయకులు రాఘవరెడ్డి, పిట్టల భూమేశ్ తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు



ధర్మారం: మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన నిరుపేద ఆశాడపు రాయమల్లు ఇల్లు బుధవారం ఉదయం కూలిపోయింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇంటి పైకప్పు నుంచి వచ్చిన నీటితో గోడలు తడిసి కూలిపోయినట్లు స్థానికులు తెలిపారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

బొగ్గుబాయి వార్తలు

ఓబీ తొలగింపుపై వీడియో కాన్ఫరెన్స్



మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

గోదావరిఖని: సింగరేణిలోని ఓసీపీల్లో ఓబీ తొలగింపుపై డైరెక్టర్లు ఎస్‌వీకే.శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రెడ్డి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అన్ని ఓసీపీల్లో ఓబీ తొలగింపు తీరును తెలుసుకున్నారు. పనులు వేగవంతం చేసేందుకు తీసుకోవాల్సిన, ఓవర్ బర్డెన్ తరలింపు సమయంలో పాటించాల్సిన రక్షణ చర్యలపై చర్చించారు. జీడీకే–5 ఓసీపీలో ఓబీ తొలగింపునకు సంబంధించిన వివరాలను ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఇన్‌చార్జి ఆఫీసర్ డి.రామస్వామి, ఐఈడీ ఏజీఎం ఆంజనేయులు, సీనియర్ సర్వే ఆఫీసర్ సురేష్ పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలి

- అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ

జ్యోతినగర్/కోల్‌సిటీ: త్వరలో జరిగే ఎన్నికల నిర్వహణకు అధికారులు సిద్ధం కావాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీ అన్నారు. బుధవారం ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని మిలీనియం హాల్‌లో పోలీస్, రెవెన్యూ, ఎక్సైజ్ శాఖ సెక్టార్ అధికారులతో సమీక్షించారు. అనంతరం కార్పొరేషన్ కార్యాలయంలో మెప్మా సిబ్బందికి అవగాహన కల్పించారు. ఎన్నికల్లో ఓటర్లను మద్యం, డబ్బు వంటి ప్రలోభాలకు లోనుచేయకుండా నిఘా ఏర్పాటు చేయాలన్నారు. పోలీస్ అధికారులు సమన్వయంతో క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని పేర్కొన్నారు. రెండో ఓటరు జాబితా సవరణలో భాగంగా వచ్చే దరఖాస్తుల విచారణ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రామగుండం తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలోని మూడు మండలాల తహసీల్దార్లు, గుర్తింపు పొందిన రాజకీయపార్టీల నాయకులతో సమావేశమయ్యారు. గోదావరిఖని ఏసీపీ తులా శ్రీనివాసరావు, తహసీల్దార్ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఏరియర్స్ ఒకేసారి చెల్లించాలి



మాట్లాడుతున్న సీతారామయ్య

గోదావరిఖని: సింగరేణి కార్మికులకు 11వ వేజ్‌బోర్డు ఏరియర్స్ విడతల వారీగా కాకుండా ఒకేసారి చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 8న సింగరేణి వ్యాప్తంగా జీఎంల కార్యాలయాల ఎదుట నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు. బుధవారం గోదావరిఖనిలో సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గతేడాది సాధించిన లాభాల్లో 35 శాతం వాటా కార్మికులకు వెంటనే చెల్లించాలన్నారు. తాము చేసిన పోరాటాలకు స్పందించిన యాజమాన్యం రెండు వాయిదాల్లో ఏరియర్స్ చెల్లిస్తామని, లేకుంటే రూ.2,800 కోట్లు ఏరియర్స్, లాభాల్లో వాటా, దీపావళి బోనస్ చెల్లిస్తామని ప్రకటించడం కార్మికులను తప్పుదోవ పట్టించేలా ఉందన్నారు. చిత్తశుద్ధి ఉంటే తప్పుడు ప్రచారాలు మాని, ఏరియర్స్ ఒకేసారి చెల్లించాలని కోరారు. నిరాహార దీక్షలకు కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు స్వామి, రంగు శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, వెంకట్ రెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.

గుండెపోటుతో సింగరేణి మాజీ ఉద్యోగి మృతి

- పార్థివదేహాన్ని మెడికల్ కాలేజీకి అప్పగించిన కుటుంబసభ్యులు



మొండయ్య (ఫైల్)



మొండయ్య పార్థివదేహానికి సెల్యూట్ చేస్తున్న కాలేజీ ప్రిన్సిపాల్, ప్రొఫెసర్లు, ఎన్జీజీలు


కోల్‌సిటీ(రామగుండం): సింగరేణి మాజీ ఉద్యోగి గుండెపోటుతో మృతిచెందగా ఆయన పార్థివదేహాన్ని కుటుంబసభ్యులు మెడికల్ కాలేజీకి అప్పగించారు. పెద్దపల్లి మండలంలోని పెద్దబొంకూరుకు చెందిన మొండయ్య(73) సింగరేణిలో పని చేసి, ఉద్యోగ విరమణ పొందాడు. బుధవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందాడు. అభ్యుదయ భావాలు కలిగిన ఆయన మరణం తర్వాత తన పార్థివదేహాన్ని మెడికల్ కాలేజీకి ఇస్తానని చెబుతుండేవాడు. మొండయ్య కోరిక మేరకు ఆయన భార్య స్వరూప, కుమారుడు అనిల్, కూతురు ఇందిర, తమ్ముడు రాజవీరు, సోదరి సరోజన మెడికల్ కాలేజీకి అప్పగించడానికి ముందుకొచ్చారు. సదాశయ ఫౌండేషన్, రామగుండం లయన్స్ క్లబ్, మగువ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గోదావరిఖనిలోని సిమ్స్‌కు అప్పగించారు. కాలేజీలో మృతుడి కుటుంబసభ్యులను ప్రిన్సిపాల్ హిమబిందు సింగ్, అనాటమీ హెచ్‌వోడీ అనిల్ రాహుల్, సదాశయ, లయన్స్ క్లబ్, మగువ ప్రతినిధులు అభినందించారు. మొండయ్య పార్థివదేహానికి సెల్యూట్ చేసి, నివాళి అర్పించారు.

పెద్దంపేట గ్రామసభలో ఘర్షణ

- పోలీసులకు ఇరుపక్షాల ఫిర్యాదు

రామగుండం: అంతర్గాం మండలంలోని పెద్దంపేటలో బుధవారం నిర్వహించిన గ్రామసభలో పలువురు ఘర్షణ పడ్డారు. ఒకరోజు ముందుగా డప్పు చాటింపు వేయించడంతో గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. గ్రామానికి చెందిన పల్లె శ్రీనివాస్ పలు సమస్యలపై ప్రశ్నించాడు. దీంతో ఎమ్మెల్యే అనుచరులుగా పేర్కొంటున్న గ్రామ పంచాయతీ పాలకవర్గానికి చెందిన పలువురు తనపై దాడి చేశారని ఆరోపించాడు. ఈ విషయమై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని తెలిపాడు. ఇదిలా ఉండగా పల్లె శ్రీనివాస్ పంచాయతీ కార్యదర్శి రమ్యపై దురుసుగా ప్రవర్తించడంతోపాటు కారోబార్ శ్రీనివాస్‌ను విధుల నుంచి తొలగించే విషయమై సమాధానమివ్వాలని పట్టుబట్టాడని కరివేద శ్రీనివాస్‌రెడ్డి, మేర్గు గురువయ్య తదితరులు ఆరోపించారు. అతన్ని సముదాయించే ప్రయత్నం చేసినా వినకుండా అసభ్య పదజాలంతో దూషించాడన్నారు. శ్రీనివాస్ పై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఈ విషయమై ఎస్సై సంతోష్‌కుమార్‌ను వివరణ కోరగా ఇరుపక్షాలవారు ఇచ్చిన ఫిర్యాదులను స్వీకరించామని, ఘర్షణకు దారితీసిన పరిస్థితులపై గురువారం క్షేత్రస్థాయిలో విచారణ చేపడుతామని తెలిపారు.

పోచమ్మ తల్లీ.. కేసీఆర్‌కు చెప్పమ్మా..



ఆలయానికి వెళ్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

పెద్దపల్లిరూరల్: 'పోచమ్మ తల్లీ.. మా ఉద్యోగాలు క్రమబద్ధీకరించేలా సీఎం కేసీఆర్‌కు చెప్పమ్మా..' అంటూ బుధవారం జిల్లాకేంద్రంలోని అమరవీరుల స్తూపం నుంచి ముత్యాల పోచమ్మ గుడి వరకు సమగ్ర శిక్షా ఉద్యోగులు బోనాలతో ప్రదర్శన చేపట్టారు. బస్టాండ్ నుంచి ముత్యాలపోచమ్మ ఆలయం వరకు వెళ్లి మొక్కులు సమర్పించుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు బాలసాని వెంకటేశం, నాయకులు సుధాకర్, తిరుపతి, రవిరాజ్, కుమారస్వామి, మల్లయ్య, రహీం, శ్రావణ్, శ్రీలత, రహీం, శ్రీధర్, నాగరాజు, రమేశ్, సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.

వీటీసీల్లో రిటైర్డ్ అధికారులు వద్దు



వినతి పత్రం ఇస్తున్న నాయికులు

గోదావరిఖని: సింగరేణి వ్యాప్తంగా వీటీసీల్లో పని చేసేందుకు రిటైర్డ్ అధికారులను గౌరవ వేతనంతో నియమించాలన్న సర్క్యులర్‌ను రద్దు చేయాలని సీఎంఓఏఐ అధికారుల సంఘం నాయకులు కోరారు. బుధవారం ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్‌ను కలిసి, వినతి పత్రం అందించారు. ఏళ్లుగా పదోన్నతి కోసం చాలా మంది అధికారులు ఎదురు చూస్తున్నారన్నారు. రిటైర్డ్ అధికారులను తీసుకోవడం వల్ల సీనియర్లకు, సర్వీస్‌లో ఉండి అనారోగ్యం బారిన పడిన వారికి అన్యాయం జరుగుతుందని తెలిపారు. రిటైర్డ్ అధికారులను ఉద్యోగాల్లోకి తీసుకునే ప్రయత్నాలను విరమించుకోవాలని కోరారు. సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు రామ్మోహన్, లక్ష్మీనారాయణ, డేవిడ్, మధుకుమార్, వీరారెడ్డి, శ్రవణ్‌కుమార్, శ్రీధర్, ఆంజనేయప్రసాద్ ఉన్నారు.

సర్క్యులర్ రద్దు చేయాలి

వీటీసీల్లో రిటైర్డ్ ఉద్యోగులను తీసుకోవాలనే సర్క్యులర్ వెంటనే రద్దు చేయాలంటూ ఆర్జీ–3 పరిధి ఓసీపీ–1లో మైనింగ్ సిబ్బంది బుధవారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. గని మేనేజర్ ఉదయ్‌హరిజన్‌కు వినతి పత్రం అందజేశారు. సర్వీస్‌లో ఉన్న సిబ్బందినే వీటీసీల్లో నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌రెడ్డి, రమణారెడ్డి, మామిడి సాంబయ్య, సత్యనారాయణ, రాజేశ్, లక్ష్మణ్, వెంకటేశ్వర్లు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.